


# చదువుకున్న బానిసలు

- దప్పిని కోటిరెడ్డి

"చారూ."

"ఊఁ".

"నిద్ర రావడం లేదా?"

**"లేదు అప్పుడే పదకొండు కావొస్తుంది. ఉదయం ఆరింటికే జె.జి.4 వాళ్ళకు హీట్ చెప్పాలి. మెదడు హీటెక్కిపోతుంది. అస్సలీమధ్య నిద్ర సరిపోవడం లేదు. పిచ్చెక్కుతున్నట్లనిపిస్తుంది."**

"నాకూ అంతే! బోర్. రొటీన్. ఇద్దరం ఒకే రూమ్‌లో వుంటూ కూడా మాట్లాడుకోవడానికి సమయమే లేదు. అయినా అంత టైమ్ మనకెక్కడుంది. తెల్లారితే ఫిజిక్స్‌తో నువు... కెమిస్ట్రీతో నేను. నువు ఆ గాల్స్ క్యాంపస్‌లో నేను ఈ బాయ్స్ క్యాంపస్‌లో... జీవితం మొత్తం 6టు 9:30 అయిపోతుంది. మనకోసం మిగిలింది నిద్ర. అదీ కూడా సరిగా రావడం లేదు."

"నాకూ అలాగే వుంది."

"అలా కాసేపు టెర్రెస్ మీదకు వెళ్దామా?"

"అలాగే!"

"అబ్బ ఈ చల్లగాలి. ఆ చందమామ. ఆ పిల్ల తెమ్మెర. అవిగో ఆ లైట్లు. ఎంత బావుందీ దృశ్యం."

"చాలా మిస్సవుతున్నామా?"

"నాకు చిన్నప్పుడు నేను రాస్కున్న ఓ కవిత గుర్తుకి వస్తుంది."

"ఏంటి నువు కవితలు కూడా రాస్తావా?"

"ఊఁ. ఇంకా చాలా చాలా. కానీ ఇప్పుడు ఇలా. ఇలా వుంటానని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. అంతా గాడ్స్ ప్లే."

"ఏదీ నీ కవిత్వం చెప్పు."

"వెన్నెల బయట
వర్షం రంగుల్లో
సీతాకోక చిలుకలా నేను
అలా వర్షంలో చిందులువేస్తూ
వుంటే
రంగు నీళ్ళు నా కాళ్ళ కింద
చిందులు వేస్తూ వుంటే
నీటి జాలుల్లో రంగుల కాగితపు పడవలు
కళ్ళు తెరిస్తే అక్షరాల విన్యాసం
ఎదురుగా సూర్యం సిగ్గుతో పరుగులు తీశాడు"

"వావ్ వండర్‌ఫుల్. ఎప్పుడు రాశావేంటి?"

"టెంత్ క్లాస్‌లో వున్నపుడు."

"చాలా బావుంది."

"కానీ ఇప్పుడిలా. జీవితం నాకర్థం కావడం లేదు. చిన్నప్పుడు చాలా సరళంగా వుంది. పెద్దయ్యాక ఎందుకింత చిక్కుగా తయారైంది?"

"అదే నాకూ అర్థంకావడం లేదు."

"చిన్నప్పుడు ఏది ఆశించానో అదే అయ్యాను. లెక్చరర్‌గా ఓ గొప్పదాన్నవుదామని. విద్యార్థులకు ఆదర్శమవుదామని. ఎక్కడో యానాంనుంచి వచ్చాను. కానీ శాలరీ తప్ప మరేముందిక్కడ?

"ఏం టీచింగ్‌లో ఇంట్రెస్ట్ లేదా?"

"ఎన్నో కలలు కన్నాను. టీచింగ్ ఫీల్డంటే ఏదో అనుకున్నాను. ఏముందిక్కడ చెప్పుకోవడానికి? ఉదయం అయిదింటికి లేవడం. రాత్రి పదింటికి పడుకోవడం."

"అందరూ చేస్తున్నది అదే కదా!"

"మన ఉద్యోగం గురించి ఈ ఊళ్ళో చాలా వింతగా మాట్లాడుకుంటారు తెల్సా?"

"ఏమని?"

"అనగనగా ఓ ఊళ్ళో ఓ పెద్దమనిషి. ఆ పెద్ద మనిషి దగ్గరకు చుట్టుపక్కల వున్న జనాలందరూ సంవత్సరానికి అరవై వేలు కట్టి తమ పిల్లలను అక్కడ బానిసలుగా చేర్పించారు. కానీ ఆ బానిసలకు కాపలాగా ఆ పెద్దమనిషికి చదువుకున్న పెద్ద బానిసలు అవసరం వచ్చింది. ఆ పిల్ల బానిసల్లో కూడా కొన్ని కేటగిరీలున్నాయి. ఐ.ఐ.టి. బానిసలు. ఏ.ఐ.ఈ.ఈ.ఈ. బానిసలు. ఎమ్‌సెట్ బానిసలు, నాన్ ఎమ్‌సెట్ బానిసలు. ఆ పిల్ల బానిసలకు కాపలాకోసం ఆ పెద్దమనిషి పేపర్‌లో ఓ ప్రకటన ఇచ్చాడు. మనలాంటి చదువుకున్న బానిసలు ఎవరి మంచి బానిసో ఎన్నుకుని అందుకనుగుణంగా శాలరీస్ ఇచ్చేవాడు. ఒక సంవత్సరంపాటు బాండ్ రాపించుకునేవాడు. అలా ఇన్ని బానిసలు మరియు చదువుకున్న మనలాంటి పెద్ద బానిసలు అక్కడ ఊడిగంచేస్తూ బానిసత్వంలోనే స్వర్గాన్ని చూస్తున్నామన్న మాట."

పడీ పడీ నవ్వింది.

"పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఒన్ ఇయర్ బాండెడ్ బానిసలమన్నమాట."

"అవును ఒకప్పటి రాజుల కథ మాదిరే. మొదట్లో కార్పొరేట్ ఎడ్యుకేషన్ అంటే ఏదో వుందని వచ్చా. ఇక్కడేముంది? పదిహేను రోజులకొకసారి ఔటింగ్. ఆదివారం వచ్చిందంటే ఎక్స్‌ట్రా బానిస చాకిరి. ఈరోజేమైందో తెల్సా?"

"ఏమైంది?"

"మా ఫిజిక్స్ హెడ్ నాతో మేరేజ్ ప్రపోజల్ పెట్టాడు. అతను పది సంవత్సరాలనుంచి ఈ బానిసల స్వర్గంలోనే పనిచేస్తున్నాడట. ఇప్పుడు సంవత్సరానికి ఏడు లక్షల శాలరీ తీస్కుంటున్నాడట. కట్నం కూడా వద్దన్నాడు. ఎందుకంటే నెలకు నేను ఇరవై వేలు సంపాదిస్తున్నాను కదా! కానీ నేను "నో"అని చెప్పాను.

"ఏం? బానే వుంటాడు కదా!"

"ఏమోనే... ఈ ఫీల్డ్‌లో ఎవర్ని చూసినా... బానిసలానే కన్పిస్తున్నారు."

"మరి ఎవర్ని చేస్కోవాలనో."

"ఎందుకనో ఈ చదువుకున్న బానిసలు వద్దన్పిస్తుంది. పల్లెటూర్లో పెద్దగా చదువుకోకపోయినా దర్జాగా ఫ్రీగా సొంతంగా పాల వ్యాపారం చేస్కునే వాడ్ని చేస్కోవాలన్పిస్తుంది. చదువుతో పనేముందే."

"అలా ఎందుకని?"

"ఎందుకో... ఈ జీవితం బాలేదు. ఉదయంనుంచి సాయంత్రందాకా ఎవరికోసమో కష్టపడి రాత్రికి మన సుఖాన్ని కూడా దూరంచేస్కుని ఐఐటి సెక్షన్స్ కోసమని... ఎంసెట్ సెక్షన్స్ కోసమని... ప్రిన్సిపాల్స్ ఇంప్రెషన్స్ కోసమని... పెళ్ళాలను కూడా మర్చిపోయే ఈ చదువుకున్న చదువునమ్ముకునే వాళ్ళను నా మనస్సెందుకో అంగీకరించడం లేదు."

"అబ్బ ఈ చెత్తనంతా కాసేపు వదిలేద్దామే. ఎల్లుండి ఔటింగ్ కదా. ఎక్కడికెళ్దాం? ఏం చేద్దాం? మళ్ళీ పదిహేనురోజులు దాకా గాడిద చాకిరి చెయ్యాలికదా."

"పదిహేను రోజులు బాగా అలసిపోయాము. ఔటింగ్‌కు ఏంచేయాలో కూడా తెలియదు. ప్రశాంతంగా నిద్రపోదామన్నా అదీరాదు. రెస్టారెంట్స్‌కు వెళ్దామంటే అదీ కుదర్దు. ఎక్కడో వున్న యానాం వెళ్లిరావాలంటే ఒక రోజు సరిపోదు. మరుసటి రోజు లీవ్ పెడ్దామంటే రెండురోజుల శాలరీ కట్. ఈ కాలేజీ రూల్స్ ఎవరు కనిపెట్టారో గానీ..."

"మరి మానేయొచ్చుగా!"

"ఇంకేమి చేయాలో తెలియక. నాతో చదువుకుని ఇంటర్మీడియట్‌లో మేరేజ్ అయిన రేవతికి అయిదేళ్ళ కొడుకు... మూడేళ్ల కూతురు. దాని మొగుడికి రైస్ మిల్లుంది. అది జీవితాన్ని ఎంత ఎంజాయ్ చేస్తుందో? చదువుకుని అశాంతిని నెత్తిన పెట్టుకున్నట్టుంది."

"అంటే?"

"ప్రపంచం గురించి మరీ ఎక్కువ తెల్సుకోకూడదేమో అనిపిస్తుంది. ఎందుకంటే పోలిక వస్తుంది. ఇప్పుడు నాకు ఇరవై వేల శాలరీ వస్తుంది. ఇంట్లో నాకు ఓ హీరోయిన్‌కి వుండాల్సిన బిల్డప్ వుంది. ఉద్యోగం మానేస్తే ఇంట్లోవాళ్ళు నన్నింత బాగా చూస్తారా? అప్పుడు మరో రకమైన అశాంతి."

"ఏంటోనే నాక్కూడా అలానే అన్పిస్తుంది."

"అవునే... కాలేజీలో చదువుకునేటపుడు సైకిల్ మీద కాలేజీకి వెళ్ళేదాన్ని. రెండు కిలోమీటర్ల దూరం. ఎంత బాగా వుండేది. కొత్త అందాలను చూస్తూ... ఆనందాలను పంచుకుంటూ... ఫ్రెండ్స్‌తో చాటింగ్స్ చేస్తూ... అల్లరిగా... ఆశగా మావేపు చూసే అబ్బాయిలను ఇంకా కవ్విస్తూ... అస్సలు జీవితమంటే అలానే కొత్త రంగులతో వుంటుందని అనుకున్నాను. కానీ ఇలా... చదువు అనే ఇనుప చట్రంలో ఇరుక్కునిపోతానని అనుకోలేదప్పుడు."

"అలాగా?"

"అవునే... రాత్రి నాన్నతో ఆరుబయట పడుకుని, ఆయన వీపుమీద రంగు పెన్నులతో అందమైన బొమ్మలు వేస్తూ... అమ్మ అన్నం తెచ్చి గోరుముద్దలు తినిపిస్తుంటే... అన్నయ్య వచ్చి అమ్మ కూచి అని వెక్కిరిస్తే... వాడి వెనుక పడీ పడీ కొట్టిన రోజులు... వాటిని తలుచుకుని జీవితం మొత్తం అలానే వుంటుందని అనుకునేదాన్ని. కానీ అలా వుండదని...ఇప్పుడే తెల్సింది."

"మొత్తానికి మీ ఫ్యామిలి బలేగా వుండే..."

"అదంతా ఒకప్పుడే. కాలంతోపాటూ వాళ్ళూ మారారు. ఆ స్థానంలో వ్యాపారబంధాలు ఏర్పడ్డాయి."

"నిజంగానా?"

"అవునే!... నాతోపాటు చదివే మా బాబాయి కూతురు ఇంటర్మీడియెట్ ఫెయిలయింది. నాకు నైంటీ పర్సెంట్ వచ్చాయి. అందరూ దాన్ని తిడుతుంటే నేను జాలిపడేదాన్ని. కానీ దానికప్పుడే పెళ్ళిచేసారు. ఇప్పుడు దానికి ఇద్దరు పిల్లలు. మొగుడు పంచాయితీ బోర్డ్ ప్రెసిడెంట్. మొన్న ఓ చిన్న కిట్టీపార్టీకని తీస్కెళ్ళింది. వాళ్ళ కల్చర్ చూస్తే, దాని మాటకారితనం చూస్తే ఇప్పుడు నామీద నాకే జాలివేస్తుంది. నాకిప్పుడు అన్పిస్తుంది అప్పుడు ఇంటర్మీడియెట్ ఫెయిలైనా బాగుండునని."

"బాగా ఫ్రస్టేషన్‌లో వున్నట్టున్నారు."

"విసుగేస్తుందే. నా బ్యాంక్ బాలెన్స్ రెండు లక్షలు దాకా వున్నాయి. వాటిని తీస్కుని రెక్కల పక్షిలా భారత దేశం మొత్తం తిరిగి రావాలన్పిస్తుంది. అలాగే ప్రపంచం గురించి పెద్దగా తెలియని బాగా చదువుకోని పల్లెటూరి రైతుని చేస్కుని ఇద్దరు లేదా ముగ్గురి పిల్లల్ని కని జీవితం మొత్తం ఎంజాయ్ చేయాలన్పిస్తుంది. ఈ గానిగెద్దు జీవితాన్ని విడిచిపెట్టాలన్పిస్తుంది."

"అవునే నీ అనుభూతిలో నేనూ లీనమైపోవాలన్పిస్తుంది."

"నేనేనాడు కూడా చదువు గురించి తప్ప మరో దాని గురించి ఆలోచించలేదు. అందుకే ఇప్పుడు చదువు తప్ప అన్నీ కావాలన్పిస్తుంది. అర్జెంట్‌గా ఓ కూతుర్ని కని దాన్ని నాలా కాకుండా నాట్యం, వ్యాపారం, అల్లరి, ఆటలు అలా చదువుతప్ప జీవితంలో ఎన్నున్నాయో అన్నిటి గురించి నేర్పించాలన్పిస్తుంది."

"నాకు నిద్రొస్తుంది."

"కానీ ఆమె మాత్రం చీకట్లోకూడా కొత్త రంగుల జీవితం గురించే ఆలోచిస్తుంది."

❖ ❖ ❖

చారు గాల్స్ క్యాంపస్‌లో ఫిజిక్స్ చెప్తుంది. అదో శ్రీలంకలాంటి ద్వీపం. అక్కడ అమ్మాయిలందరూ నిజంగా రాక్షసుల్లానే వుంటారు. చిన్నప్పటి నుంచి ఎడారిలాంటి హాస్టల్ జీవితంలో శిక్షను అనుభవిస్తుంటే అలానే వుంటారేమో. వాళ్ళ భవిష్యత్తుని ఒక్కోసారి ఊహించుకుంటేనే భయమేస్తుంది. అస్సలు మానవత్వంమీద వాళ్ళకు నమ్మకముంటుందా అని అన్పిస్తుంది.

గాల్స్ సెక్షన్ ఇన్‌ఛార్జ్ మహాస్ట్రిక్ట్. మన భాషలో చెప్పాలంటే లెక్చరర్ ఎప్పుడు ఏ తప్పుచేస్తాడా వెంటనే ప్రిన్సిపాల్‌కి కంప్లయింట్ చేద్దామా అన్న ఆలోచనలోనే వుంటాడు. మేనేజ్‌మెంట్‌కి కుక్కలా స్టాఫ్‌మీద నియంతలా వుంటాడు. ఆ మొఖంమీద ఎప్పుడూ నవ్వు వుండదు. వాళ్ళ బామ్మ సొమ్ము మొత్తం దోచుకుని పోయినట్లుంటాడు.

నేనేనాడు కూడా చదువు గురించి తప్ప మరో దాని గురించి ఆలోచించలేదు. అందుకే ఇప్పుడు చదువు తప్ప అన్నీ కావాలన్పిస్తుంది. అర్జెంట్‌గా ఓ కూతుర్ని కని దాన్ని నాలా కాకుండా నాట్యం, వ్యాపారం, అల్లరి, ఆటలు అలా చదువు తప్ప జీవితంలో ఎన్నున్నాయో అన్నిటి గురించి నేర్పించాలన్పిస్తుంది.

ఓ రోజు...

"చారు రెండు నిమిషాలు లేటయింది.
ఇలా అయితే కష్టం."

చారు అతనివేపు చూసింది. రెండు నిమిషాల లేటుకి కూడా రెండు గంటలుగా కొలవగలిగిన అతని సిన్సియారిటీకి జోహార్లర్పించింది.

"ఇలా ఎప్పుడూ రాకు."

"అతని మొఖంవేపు చూసింది. ప్లాస్టిక్‌తో ఒక విగ్రహాన్ని తయారుచేస్తే ఎలా వుంటుందో అలా వుంది. ఏ ఫీలింగ్స్ లేవు. కేవలం రాయిలా వున్నాడు. జాలేసిందామెకి.

క్లాస్‌లో లెస్సన్ చెప్పబుద్ధికాలేదు. పిల్లలుకూడా ఈరోజు క్లాస్ వద్దు మేడమ్ అన్నారు. మరేదైనా క్విజ్ పెట్టమన్నారు. ఆమెక్కడా మనస్సు బాలేక క్విజ్ పెట్టింది.

మధ్యలో...

"మేడమ్ ఇన్‌చార్జ్ సార్..." పిల్లలు హెచ్చరించారు.

అయినా ఆమె విన్పించుకోలేదు. ఆ పిల్ల బానిసలకు కూడా లెక్చరర్ లాంటి పెద్ద బానిసలమీద జాలి కలుగుతుంది. అందుకే అప్పుడప్పుడూ డైరెక్టరు గారొచ్చినపుడైనా ప్రిన్సిపాల్ గారొచ్చినప్పుడైనా వాళ్ళు హెచ్చరించేవాళ్ళు.

ఇన్‌ఛార్జ్ క్లాస్‌వేపు చాలాసేపు ఆ తర్వాత ఆమెవేపు సీరియస్‌గా చూశాడు. అతని మొఖంలో ఓ వెర్రి క్రూరత్వం కన్పిస్తుంది. ప్రిన్సిపాల్‌గారి దగ్గర మార్కులు కొట్టేయడానికి మంచి చాన్స్ దొరికిందతనికి. అక్కడ ఆమెనేమి అనలేదు. నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

ప్రిన్సిపాల్‌గారి రూమ్‌లో...

"మీమీద ఈమధ్యన చాలా కంప్లయింట్సు వచ్చాయి." చారు ఏమీ మాట్లాడలేదు.

"మనం పిల్లలకు లెస్సన్స్ చెప్పడానికే ఇక్కడుంది. వెర్రి క్విజ్‌లను పెట్టడానికి కాదు."

ఆమె అతనివేపు చూసింది. ఇన్‌చార్జ్‌కన్నా ఇంకొంచం బలంగా బలిసిన కుక్కలా కన్పించాడు. ఆమెకి నవ్వొచ్చింది.

"వాళ్ళ తల్లిదండ్రులు అరవై వేలిచ్చి పిల్లలను ఇక్కడ చదివిచ్చేది ఎందుకు?"

"బానిసలుగా వుంచడానికి." ఆమె నోట్లోంచి అనుకోకుండా వచ్చింది.

అంతే ఆయన స్టన్ అయిపోయాడు. మొఖం కందగడ్డలా మారిపోయింది. "ఈ కాలేజీకి కొన్ని ఎథిక్స్ వున్నాయి తెల్సా?" అన్నాడు సీరియస్‌గా.

"అవును సర్. ఆదివారం కూడా పిల్లలచేత రుబ్బిస్తూ... లెక్చరర్స్‌ను కుక్కల్లా కాపలా పెడ్తారు. ఒక రోజు లీవ్ పెడితే రెండురోజుల శాలరీ కట్ చేస్తారు. జాండిస్ వచ్చినా చచ్చిపోతాడని తెల్సినా మీకు కనికరం లాంటిదేమీ కలగదు. ఒకవేళ కాలేజీ మానేయాలంటే రెండునెలల శాలరీ పే చేస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటారు. ఉదయం ఆరింటినుంచి రాత్రి పదింటి దాకా నాన్‌స్టాప్‌గా మాచేత బానిస చాకిరి చేయించుకుంటారు. ఇవేకదా మీరు చెప్పే ఎథిక్స్. మీ కాలేజీ రాజ్యాంగం." అందామె ఆవేశంగా.

ఆయన మొదట ఆశ్చర్యానికి లోనయ్యాడు. అంతలోనే సీరియస్‌గా... "మీరు మరీ టూమచ్‌గా మాట్లాడుతున్నారు. అంతిష్టం లేకపోతే మానుకోండి."

ఆమెకి నవ్వొచ్చింది. "సర్... ఒక లెక్చరర్ మానుకుంటే ఏ కాలేజీకయినా నష్టమే. కానీ ఇక్కడ మీకు మాత్రం ఒక లెక్చరర్ మానుకుంటే బోనస్‌గా రెండునెలల శాలరీ వస్తుంది. ఎక్కడో హైదరాబాద్‌లో వున్న విద్యాశాఖ దీన్ని అస్సలు పట్టించుకోదు. సెన్సేషనల్ న్యూస్‌కోసం ప్రాకులాడే న్యూస్ చానెల్స్‌వారు ఈవేపసలు తొంగి చూడరు. అందుకే మీరు సేఫయిపోతున్నారు."

ఆయనలో బి.పి. హై లెవెల్‌లో విజృంభించింది. బలంగా టేబుల్ మీద గుద్దాడు. "గెటవుట్"అన్నాడు ఆవేశంగా.

చారుకి నవ్వొచ్చింది. చూస్తుంటే జాలి వేసింది. "కొంచెం బి.పి. తగ్గించుకోండి సర్. నిజం చెప్తే అంతే. కానీ ఇది ఎంతోకాలం సాగదు సర్. మనుషుల్లా వుండండి."అని ఆమె లేచి వెళ్ళింది.

❖ ❖ ❖

చారు బస్‌లో ఇంటికి వెళ్తోంది. ఇప్పుడు మనస్సంతా హాయిగా వుంది. ఊరిలో పచ్చని పొలాల్లో ఆమె బ్యాంక్ బ్యాలెన్స్ రెండు లక్షలతో గేదెల ఫామ్‌పెట్టి ఇద్దరి కుర్రాళ్ళను కాపలాగా పెట్టి స్కూటీమీద పచ్చని పొలాలగుండా ఆ పాలను మిల్క్‌డైరీ దగ్గర పోసి జీవితాన్ని స్వేచ్ఛగా ఎగిరే సీతాకోక చిలుకలా ఎంజాయ్ చేయాలని వుంది.

నాకొద్దీ చదువుకున్న బానిసల ఉద్యోగం... ★

**రచయిత చిరునామా:**
**దప్పిని కోటిరెడ్డి,**
శశి డిగ్రీ కాలేజీ, వెలివెన్ను,
ఉండ్రాజవరం, పశ్చిమ గోదావరి జిల్లా